వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 05 సెప్టెంబర్ 2022

## కేసులు త్వరితగతిన పరిష్కరించండి

### న్యాయమూర్తుల సమీక్షా సమావేశంలో హైకోర్టు జడ్జి బట్టు దేవానంద్



కడప సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

గౌరవ జస్టిస్ బట్టు దేవానంద్, జడ్జ్, హై కోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జ్ అధ్యక్షతన వైయస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తులతో సమీక్ష న్యాయ సేవాసదన్ కడప నిర్వహించారు. కేసుల గురించి చర్చించారు. కేసులు త్వరితగతిన పరి ష్కారం, పలు అంశాలపైన న్యాయమూర్తులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌరవ ఎన్.సోల మన్ రాజుతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇతర న్యాయ మూర్తులు పాల్గొన్నారు.

## ఆదర్శం ఆ ఆశావర్కర్



గోపవరం,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త;

రెక్కాడితే గాని డోక్కాడని ఓ నిరుపేద ఎస్టి తెగకు చెందిన ఆనంద్(8) అనే బాలుడికి ప్రమాద వశాత్తు చేతి నుంచి వేళ్లతో పాటు నరాలు కూడా విడిపోయాయి. ఈ సంఘటన మడకలవారిపల్లె ఎస్టి కాలనీలో జరిగింది,వెంటనే సంఘటనా స్థలానికి ఆ గ్రామ ఆశావర్కర్ నారాయణమ్మ చేరుకొంది. ప్రాదమిక చికిత్స చేసింది. వారి పేదరికం, నిస్సహాయతను చూసిన ఆమె చెలించిపోయింది. సహాయం కోసం దాతలను ఆశ్రయించింది. ఆమె అభ్యర్దనను పరిశీలించిన దాతలందరూ తోచిన ఆర్ధిక సహాయాన్ని అందచేసారు. ఈ మేరకు బాలుడి తల్లితండ్రులు పోలమ్మ, అంకయ్యలు, ఇటు ఆశావర్కర్ నారాయణమ్మకు, అటు ఆర్ధిక సహాయాన్ని అందించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు. గాయపడ్డ బాలుడు ఆనంద్‌ను కడప నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి పంపి చేతి నుంచి విడిపోయిన వేళ్లను అతికించేందుకు చికిత్స చేస్తున్నారు. ఇటువంటి నిరుపేదలకు చేయూతనందించిన ఆశావర్కర్ నారాయణమ్మ ఆదర్శవంతంగా నిలిచిందని ఆ గ్రామప్రజలు పేర్కొంటున్నారు,

## మంజునాథరెడ్డికి ప్రముఖుల నివాళి





రామాపురం, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:

మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డి గారి పల్లెకు చెందిన స్పెషల్ క్లాస్-1 కాంట్రాక్ట్ పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి తనయుడు పప్పిరెడ్డి మంజునాథ్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. అందులో భాగంగా ఆదివారం ఆయన శుభ స్వీకరణ సందర్భంగా ప్రముఖులు, నాయకులు ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో రాయచోటి ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఉరవకొండ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనకాపల్లి జగన్నాధరావు, గడికోట మోహన్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, గడికోట ద్వారక నాథ్‌రెడ్డి, సి.వి. సుబ్బారెడ్డి (మిగతా IVవ పేజీలో)

## నెలకో బిల్లు...గుండె గుబేలు..!



పెద్దతిప్పసముద్రం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :

పెద్దతిప్పసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ప్రతినెలా నిర్దిష్ట తేది(30రోజుల)కి మీటర్ రీడింగ్ నమోదు చేయాలి. కానీ అధికారులు పర్యవేక్షణా లోపం, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రెండు లేక నాలుగు రోజులు ఆలస్యంగా మీటర్ రీడింగ్ నమోదు చేస్తున్నారు. స్లాబ్‌రేట్లు మారిపోయి విద్యుత్ బిల్లులు రెట్టింపు స్థాయిలో జారీ అవుతుండడంతో వినియోగదారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడడమే కాకుండా వినియోగదారులు నోరెల్ల బెడుతున్నాడు... మండలంలోని పలు పంచాయితీ, గ్రామాల్లో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా మీటర్ చూడకుండానే బిల్లులు వేయడం, లేదా రోజులు పెంచి బిల్లు తీసి వేలకు వేలు వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల వినియోగదారుడు ఖర్చుచేయని విద్యుత్‌కు కూడా ముందే బిల్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు. విద్యుత్ రీడర్లు ఆలస్యంగా యూనిట్లను రీడ్ చేస్తుండడంతో యూనిట్లు పెరిగి స్లాబ్‌లో తేడా వస్తోంది. దీనిపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అర్జీదారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొన్ని గ్రామాల్లో ప్రతినెల 10వ తేది రీడింగ్ ఇచ్చేవారని అప్పుడు నెలకు రూ.200వచ్చేదని అయితే గత రెండు నెలలుగా ప్రతినెలా 15వ తేది రీడింగ్ చేసి ఇస్తున్నారని దీంతో రూ.350లు వస్తుండంతో వినియోగదారులు పెద్దమొత్తంలో కట్టాలంటే డబ్బులు లేక బిల్లు కట్టాల్సిన సమయం కన్నా లేటుఫీజుతో కట్టుకోవాల్సి వస్తన్నట్లు తెలిపారు. అదే బిల్లు ఒక్క రూ.400లు వస్తే రెండవ నెల రూ.600లు, మూడవ నెలకు రూ.1100లు వచ్చినట్లు చెబుతున్నారు. ఇలా (మిగతా IIవ పేజీలో)

## గంగ ఒడికి ఘననాథుడు

### భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు



కడప కార్పొరేషన్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:

శివపార్వతుల తనయుడు వినాయకుడు గంగ ఒడికి చేరారు. వినాయక చవితి పండగను దేశ వ్యాప్తంగా భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాంతాలు, గ్రామాల్లో ఉత్సాహంగా గణేష్ నిమజ్జనంలో పాల్గొన్నారు. కడప నగరంలోని వీధుల్లో గల్లీలో కొలువదీరిన గణనాథులతో పండగ వాతావరణం నెలకొంది. గణేష్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.



**భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలుకుతూ నిమజ్జనం**

ఇష్టదైవానికి వీడ్కోలు పలుకుతూ నిమజ్జనం చేశారు. పండగ రోజు ఎంత సందడి ఉంటుందో నిమజ్జనం రోజున అంతకంటే ఎక్కువ సందడి చేశారు. డప్పులు వాయిద్యాలు, కోలాటాలు, ఆటపాటలతో గణేష్ నిమజ్జనం కార్యక్రమం చాలా ప్రత్యేకంగా జరుగుతుంది. భారీ ఊరేగింపులతో గణనాథుని తీసుకెళ్తూ గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. పలు ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనాలు చేశారు. ఇక ఊరేగింపులో డప్పుల మోతకు భక్తులు ఉత్సాహం చూసి పోలీసులు సైతం కాలు కదిపారు. పాత కడప చెరువు, సిద్దవటం పెన్నానది, కృష్ణ కాలువ వంటి ప్రాంతాల్లోనే కాక జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక చోట్ల గణేష్ నిమజ్జనానికి పోలీసు శాఖ ఏర్పాట్లు చేశారు.

**కరోనా తరువాత వినాయక చవితి పండగ**

కరోనా మహమ్మారి తరువాత ఎలాంటి ఆంక్షలు లేకుండా ఈ ఏడాది వినాయక చవితి వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతిని చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. వినాయకుడి విగ్రహాలను ప్రవహించే నదులు, కాలఉవలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంతకు ముందు రోడ్లపై ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. యువత డీజే డ్యాన్సులు, మేళ తాళాలు, డ్రమ్స్, వాయిద్యాల నడుమ అందరూ ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు. చెరువుల నుంచి మట్టి సేకరించి ఆ మట్టితోనే వినాయక విగ్రమాలు తయారు చేసి వాటిని పూజించి తరువాత తిరిగి అదే నీటిలో నిమజ్జనం చేస్తారు. ఇలలా చెరువుల విగ్రహాల తయారీ కోసం మట్టిని తీసుకోవడం వల్ల అక్కడ లోతు పెరుగుతుంది. ఆయుర్వేద గుణాలు, వినాయక (మిగతా IIవ పేజీలో)

## రేపన సుధాకర్‌కు విద్యాపోషక రత్నఅవార్డు

### నేడు కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం



రాయచోటి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా టి .సుండుపల్లి మాధురి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, సమాజ సేవకులు, వ్యాపారవేత్త రేపన సుధాకర్‌కు విద్యా పోషకరత్న అవార్డు దక్కిం ది. సోమవారం జిల్లా కలెక్టర్ గిరీష చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. సుధాకర్ విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యంగా సమాజసేవలో ఆయన ఎప్పుడూ ముందువరుసలో ఉంటున్నారు. నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. దాదాపు పదేళ్ల క్రితం ప్రైవేటు విద్యా సంస్థ స్థాపించి ప్రభుత్వ పాఠశాల తరహాలో అందరికి విద్యను అందుబాటులోకి తీసుకొని వచ్చారు. మండలంలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో సహాయ, సహకారాలు అందిస్తూ అందరి మన్నలను సుధాకర్ పొందారు. రాజకీయాలకతీతంగా, వివాదాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవలే జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి సుందపల్లె మాధురి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ రాజమ్మ సైతం పాఠశాలను తనిఖీ చేశారు. మండల స్థాయి అధికారులు అందరూ మాధురి పాఠశాలను తనిఖీ చేసి సుధాకర్‌ను అభినందించారు. ఈ నేపథ్యంలో సుధాకర్‌కు విద్యా పోషక రత్న అవార్డు లభించడం పట్ల సుధాకర్‌ను పలువురు ప్రముఖులు, అధికారులు, విద్యార్థుల తల్లి దండ్రులు, స్కూల్ సిబ్బంది అభినందించారు.

## కడపలో బాలుడు దారుణ హత్య

### మేనత్త, మామలే చిత్రహింసలు పెట్టి చంపేశారు

### పరారీలో నిందితులు : గాలింపు కోసం ప్రత్యేక బృందాలు

కడప క్రైం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:

అన్నెం, పున్నెం ఎరుగని బాలుడిని కేవలం అల్లరి చేస్తున్నాడని స్వయానా మేనత్త, మామలు చిత్రహింసలు పెట్టి మరీ దారుణంగా హత్య చేసిన సంఘటన కడపలో చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. మృతుని నానమ్మ ఇందిరమ్మ చిన్నచౌకు పోలలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా నందలూరు కోనాపురం హరిజనవాడకు చెందిన వెలగచెర్ల శివకుమార్, భాగ్యలక్ష్మిలు భార్యాభర్తలు. జీవనోపాధి కోసం వీరు కువైట్ వెళ్లారు. ఏడాదికి లేదా రెండేళ్లకో ఇండియా వస్తూ వెళ్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సంతానంలో పెద్ద కుమారుడు వెలగచర్ల అయాన్ ఆశ్రిత్‌కుమార్(8). ఈ బాలుడిని చక్కగా చదివించాలని తల్లిదండ్రులు కడపలో ఓంశాంతినగర్‌లో ఉంటున్న పిల్లాడి మేనత్త ఇంద్రజ, అంజన్‌కుమార్‌ల వద్ద 10 రోజుల కిందట వదిలిపెట్టి వెళ్లారు. వీరు వై.జంక్షన్ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూలులో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. అయాన్ ఆశ్రిత్‌కుమార్‌ను తమ బిడ్డలాగా చూసుకుంటామని చెప్పిన మేనత్త, మామలు తమ ఇంటిలో పెట్టుకొని బాగా అల్లరి చేస్తున్నాడనే నెపంతో రోజూ చిత్రహింసలకు గురి చేసేవారు. చలాకుతో వాతలు పెట్టేవారు. ఈనెల 3వ తేదీన పుట్టిన రోజు నిర్వహించారు. ఫోన్‌లో తన మేనల్లుడిని బాగా చూసుకుని, చదివిస్తున్నామని అన్న శివకుమార్‌కు చెల్లలు ఇంద్రజ తెలియజేసింది. కానీ చిత్రహింసలకు గురి చేసి దారుణంగా హత్య చేశారు. తర్వాత అన్నయ్యా.. మేము తప్పుచేశాము అయాన్ ఆశ్రిత్‌కుమార్ చనిపోయాడంటూ చెల్లెలు ఇంద్రజ కువైట్‌లో ఉన్న తన అన్న శివకుమార్‌కు వాట్సాప్ వాయిస్ మెసేజ్ పెట్టి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసింది. తన భర్త అంజన్‌కుమార్, కుమార్తెతో కలిసి పరారయ్యారు. ఈ మెసేజ్‌ను రిసీవ్ చేసుకున్న అన్న శివకుమార్ వెంటనే తన చెల్లెలుకు ఫోన్ చేశాడు. స్విచాఫ్ రావడంతో తన తల్లిదండ్రులకు స్నేహితులకు, బంధువులకు సమాచారం ఇచ్చాడు. వారు కడప రిమ్స్‌కు చేరుకొని పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. బాలుడి హత్య కేసుగా నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. పోలీ సులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వీరి కోసం విస్తృతంగా గాలింపు చర్యలుచేపట్టారు.

## ట్రిపుల్ ఐటి పిలుస్తోంది... రారండోయ్...

- ఈ ఏడాది సప్లిమెంటరీ విద్యార్థులకూ అవకాశం
- నాలుగు ట్రిపుల్‌ఐటీలకు 13వేలకు చేరిన దరఖాస్తులు
- సెప్టెంబరు 19వరకు గడువు
- 29న విద్యార్థుల ఎంపిక జాబితా
- అక్టోబరు 17 నుండి తరగతులు ప్రారంభం



వేంపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ట్రిపుల్‌ఐటీ ప్రవేశాల నోటిఫికేషన్ ఆగస్టు 30న విడుదలైంది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లో ప్రవేశాల అనంతరం తరగతులు ప్రారంభం అయ్యేవి. అయితే ఈ ఏడాది సప్లిమెంటరీ విద్యార్థులకు కూడా అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కాస్త ఆలస్యంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది సప్లిమెంటరీ విద్యార్థులకు కూడా ఒక అవకాశం ఇవ్వడం వరంగా భావించ వచ్చు. శుక్రవారం నాటికి రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విద్యాలయం పరిధిలో ఉన్న నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో సుమారు 13వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమా చారం. ప్రతి విద్యార్థి ఈనెల 19వ తేదీలోగా ట్రిపుల్‌ఐటీ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. అనంతరం విద్యార్థుల మార్కుల శాతాన్ని బట్టి ట్రిపుల్‌ఐటీ అధికారులు జాబితాను సిద్ధం చేస్తారు.

**నాలుగు ట్రిపుల్‌ఐటీలకు ఒకే దరఖాస్తు**

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీలకు కలిపి ఒకే దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఓసీ, బీసీ అయితే రూ.250, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.150తో పాటు అదనంగా రూ.30లు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 2021-22లో పదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి మండలం నుండి కనీసం ఇద్దరు విద్యార్థులకు సీట్లు వచ్చేటట్లు నిర్ణయించారు. ఇడుపుల పాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలలో ఒక్కొక్కదానిలో 1000 మంది చొప్పున, అలాగే ఈబీసీ కోటా కింద ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 100మంది ఒప్పున మొత్తం 4400మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. వీటిలో 85శాతం సీట్లను ఆయా విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్‌ఐటీల పరిధిలోని జిల్లాలకు చెందిన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 15శాతం సీట్లను ప్రతిభ ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఓపన్ కేటగిరిలో ఎంపిక చేస్తారు. పదో తరగతి పరీక్షల్లో, తత్సమాన పరీక్షల్లో ఒకే మార్కులు వస్తే తొలుత గణితంలో ఆ తరువాత జనరల్ సైన్స్, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, ప్రథమ లాంగ్వేజీలలో వచ్చిచన మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. అవి కూడా సమానంగా ఉంటే పుట్టినతేదీ ఆధారంగా వయసు ఎక్కువ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల పరిధిలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అక్టోబరు 17 నుండి తరగతులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## వర్షానికి తెగిపోయిన రోడ్డు

### పట్టించుకోని అధికారులు... ఇబ్బందుల్లో గ్రామ ప్రజలు





పెద్దతిప్పసముద్రం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :

అన్నమయ్యజిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయితీకి చెందిన బొంతవారి పల్లెకు గత వారం రోజులుగా రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రజలు దిక్కుతోచని స్థితిలో అయోమయంలో ఉంటే రోడ్డు మార్గం అదికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈనెల 29న కురిసిన కుండపోత వర్షానికి రంగసముద్రం, బొంతవారిపల్లె వాగుపై ఉన్న రోడ్డు నీటి ప్రవాహం అధికమై పూర్తిగా రోడ్డు కోసుకుపోయింది. ఈ రహదారిలో వాహనాలు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. 108 వాహనం గ్రామంలోకి రావాలన్నా వాగుపై రాలేక, ప్రత్యామ్నాయ రహదారిలేక తీవ్ర అసౌకర్యానికి గుర య్యారు. వారం రోజులుగా రహదారిలేక, తాగేందుకు నీరులేక అవస్థలు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై ఏ అధికారి దృష్టికి తీసుకెళ్ళినా స్పందన కరువైందన్నారు. దీంతో గ్రామంలోని యువకులు, పిల్లలు కలసి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొన్న కొయ్యకట్టెలతో వంతెనపై నడుచుకొంటూ వెలుతున్నారు. భారీవర్షాలతో ఏర్పాటు చేసుకొన్న వంతెన కాస్త కొట్టుకు పోయింది. దీంతో రహదారిలేక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## హెచ్చరికలు లేని స్పీడ్ బ్రేకర్లు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:



కడప - చెన్నై ప్రధాన జాతీయ రహదారి మంగంపేట హైవేరోడ్డు బి.కమ్మపల్లెకు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడడంతో అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే అంతకు ముందు ఎప్పుడో ఐదారేళ్ల కొకసారి ప్రమాదాలు జరిగేవి. అయితే హెచ్చరికలు, తెల్ల గుర్తులు లేనందున ఈ స్పీడ్ బ్రేకర్ల వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. స్పీడ్ బ్రేకర్లు వేయడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రయాణికులు, వాహనడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం, గురువారం ఉదయం, మధ్యాహ్నం ఒక కారు, టెంపో, రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. అయితే ప్రయాణికులు ఈ స్పీడ్ బ్రేకర్ల వద్ద హెచ్చరికలు తెలిపే తెల్ల గుర్తులు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేసే అధికారులను కోరుతున్నారు. బ్రేకర్లు వేశారు.. గుర్తులు మరిచారు అనే నినాదంతో కొంత సేపు నినాదాలు చేసి అధికారులు నిద్రావస్థలో నుంచి మేలుకొని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రించకుండా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## గుంతలమయంగా మారిన రహదారి

### పట్టించుకోని అధికార, ప్రజా ప్రతినిధులు



బద్వేలు రూరల్, సెప్టెంబరు 04 ప్రభాతవార్త

మండల పరిధిలోని గ్రామాలలో ప్రధాన రహదారులు అస్తవ్యస్థంగా మారినప్పటికీ ఏ అధికారి కూడా పట్టించుకోక పోవడం శోచనీయంగా ఉందని వాహనదారులు, పాదాచారులు ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. చినుకు పడితే చిత్తడే అన్న చందంగా వర్షం వచ్చినా వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారడంతో సమీపంలో ఉన్న గ్రామా లలో దోమల బెడద ఎక్కువ అవుతోంది. అదే విధంగా కొత్త చెరువు గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారి గుంతలమయంగా అస్తవ్యస్థంగా మారిందని స్థానికులు వాపోతున్నారు, కమలకూరు వెళ్ళే ప్రధాన రహదారి కూడా గుంతలమయంగా మారడమే కాకుండా ఇటీవల ట్రాక్టర్లతో ఎక్కువ రద్దీగా ఉండడంతో ఈ రహదారి కూడా ఆగమ్యగోచరంగా మారింది. చెరువు కట్ట మీద రాత్రివేళల్లో వెళ్ళాలంటే ఎక్కడ చూసినా గుంతలమయం కావడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. తెల్లవారితే ఆటోలు మొదలు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెళ్ళే ప్రధాన రహదారి అస్తవ్యస్థంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రహదారి మరమ్మత్తులు చేపట్టి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

# ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సదస్సును జయప్రదం చేయండి

**కడప వైద్య విభాగం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



కడప నగరంలో సెప్టెంబరు 6న 'నిరుద్యోగ సమస్య పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల పక్కనే ఉన్న యూటీఎఫ్ భవన్‌లో నిర్వహిస్తున్నారని ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సూర్యారావు హాజరవుతున్నారని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీఎం ఓబులేసు తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకర్స్‌కు సదస్సు కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వాగ్దానాల అమలు చేయాలని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కుపరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. వవేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉక్కు పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటంలో అధికార వైసీపీ ప్రతిపక్ష టీడీపీ ఒరెండూ విఫలం చెందాయన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు వదలకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు స్టీఫెన్, నగర నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

# టపాసులు పేలి మహిళ మృతి

**దువ్వూరు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని నారాయణపల్లి గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామంలో టపాసులు పేలుస్తున్నారు. అందులో భాగంగా ఆ గ్రామానికి చెందిన పాతకోట బాలచెన్నమ్మ అటు వైపు వెళ్తుండగా టపాసులు కాల్చే వ్యక్తుల నిర్లక్ష్యంతో టపాసులు ఆమె సమీపంలో పడడంతో అవి పేలి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా దర్గావీది నుంచి మారెమ్మ గుడి వైపు వెళ్తుండగా వినాయకుడి విగ్రహం ఎదురుగా టపాసులు పేల్చారు. మహిళ అక్కడ నిలబడి ఉండగా ఆ టపాసులు ఆమె కిందనే పేలడంతో మహిళ చెవి వద్ద పెద్ద శబ్ధం చేస్తూ పేలాయి. దీంతో బాల చెన్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. అయితే టపాసులు నిర్లక్ష్యంగా పేల్చారా.. లేక ఏదైనా ఉద్దేశంతో పేల్చారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. బాలచెన్నమ్మ భర్త నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కేసీ రాజు తెలిపారు.

# ఘనంగా ముగిసిన వినాయక నిమజ్జన వేడుకలు

**దువ్వూరు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక విగ్రహాలను నిలిపి ఐదు రోజుల అనంతరం నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్దజొన్నవరం, కానగూడూరు, మాచనపల్లె, గుడిపాడు తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను అక్కడక్కడ ప్రవహిస్తున్న కాల్వలో నిమజ్జన కార్యక్రమం జరిపారు. ఆదివారం ఎక్కువగా విగ్రహాలు ఎడమడక కాల్వ వద్దకు రావడంతో పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను ఒక వైపునకు మళ్లించారు. విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. చిన్నసింగనపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో వినాయక విగ్రహాలను చల్లబసాయపల్లె రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలు ముగిశాయి.

## కేంద్రానికి మంచి బుద్ధి ప్రసాదించాలని గణపతి విగ్రహానికి వినతి : డీవైఎఫ్ఐ

**జమ్మలమడుగు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ఏపీకి విభజన హామీలు అమలు పరచకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తూ ఉన్నదని కేంద్రానికి మంచి బుద్ధి ప్రసాదించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో జమ్మలమడుగు గణపతి విగ్రహానికి వినతిపత్రంను డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, తులసీశ్వర్ యాదవ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విభజన హామీల అమలు ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. యువత ఉద్యోగాలు లేక ఉపాధి పరిశ్రమలు లేక ఉపాధి కోసం వలసలు పోతున్నారన్నారు. మరికొందరు బలవన్మరణానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని లేకుంటే యువత రాబోవు రోజుల్లో కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ రెండు పార్టీలు కేంద్రంపై పోరాడాలని రాష్ట్ర హక్కులు సాధించాలని లేకుంటే రాష్ట్ర ప్రజలు, యువత తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో రవి, ప్రతాప్, రాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు పెద్దపీట

**కమలాపురం నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ మహమ్మద్ సాదిక్**

**కమలాపురం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**




వైసీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు పెద్దపీట వేశారని కమలాపురం నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ మహ్మద్ సాదిక్ అన్నారు. ఆదివారం కమలాపురంలోని స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న టీడీపీ మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా, వైసీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందనడం అవగాహన రాహిత్యమన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారన్నారు. అమ్మఒడి పథకం, ముస్లిం మైనార్టీలకు అందడం లేదా అన్నారు. విద్యా దీవెన, వైఎస్ఆర్ ఆసరా చేయూత, వసతి దీవెన, వైఎస్ఆర్ బీమా పథకాలలో మైనార్టీలకు న్యాయం జరగడం లేదా అని టీడీపీ మైనార్టీ నాయకులు గుర్తించా లన్నారు. రాష్ట్రంలో ఒక మైనార్టీ మంత్రి, డిప్యూటీ సీఎం, ముగ్గురు మైనార్టీ ఎమ్మెల్సీలు, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా మైనార్టీ మహిళలకు అవకాశం ఇచ్చిన ఘనత కూడా వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. టీడీపీ హయాంలో నాయ కులు భోంచేసిందే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చెప్పిన టైంలో ఒక్క బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి అవినీతి లేకుండా పారదర్శకంగా జమ చేయడమే వైసీపీ ప్రభుత్వ ఏకైక లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, మస్తానయ్య, జిలానీబాషా, దస్తగిరి పాల్గొన్నారు.

# గంగ ఒడికి ఘననాథుడు

(మొదటి పేజీ తరువాయి)

విగ్రహాలకు నీటిలో పత్రితో కలిపి నిమజ్జనం చేయడం వల్ల నీరు సులభంగా ప్రవహించేందుకు వీలు కలుగుతుందది. అంతేకాదు ఆయుర్వేద గుణాలు ఒకూడా మనకు లభిస్తాయి. ఇవే నీటిని మనం తాగడం వల్ల ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు రావని చాలా మంది నమ్ముతారు. వినాయక విగ్రహాలను తయారు చేసేందుకు వాడిన మట్టి, పత్రి గరిక ఇతర వస్తువుల వల్ల నీటిలో ఉండే చిన్న చిన్న పురుగులు, కీటకాలన్నీ మరణిస్తాయి. దీంతో నీరు శుభ్రంగా మారుతుంది. నిమజ్జనం నిమిత్తం ఇనాయకుడిని బయటకు తీస్తున్నప్పుడు ఇంట్లో ఉండే సమస్యలన్నీ తొలగిపోతాయని కొంత మంది నమ్మకం. వినాయకుడిని నీటిలో నిమజ్జనం చేసినప్పుడు మనకు జీవితంలో ఎదురయ్యే కష్టాలన్నీ తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

# ఘనంగా గణపతి నిమజ్జన ఉత్సవాలు

**ఓబులవారిపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలంలోని 22 పంచాయతీల్లో వినాయక చవితిని పురస్కరించుకొని గణపతి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని రాళ్ల చెరువుపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా ఎన్నడూ లేని విధంగా వినాయక చవితి ఉత్సవాలను నాగేంద్రరెడ్డి, రవీంద్రారెడ్డి సర్పంచి పోలిపాపిరెడ్డి ఘనంగా నిర్వహించి అన్ని విధాలా అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం 15 కేజీల లడ్డును చింతా యానాదయ్య యాదవ్ రూ.1.20లక్షలకు వేలం పాటలో దక్కించుకొని పరవసించిపోయారు. ఈ కార్య క్రమంలో అరవ రవి యాదవ్, అనీల్‌యాదవ్, మహేంద్ర యాదవ్, నాగేంద్ర యాదవ్, చంద్రా యాదవ్, వెంకటసుబ్బయ్య యాదవ్, చిన్నరెడ్డి, పాణ్యం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి నిమజ్జనాలు

**ఓబులవారిపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన ఓబులవారి పల్లెలో ఘనంగా గణేషుని నిమజ్జన ఉత్సవాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం హిందూ, ముస్లిం సోదరులు కుల మతాలకు అతీతంగా వినాయకుని ఉత్సవాల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఎన్నడూ లేని విధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామ పురవీధుల్లో వినాయకుడి రథాన్ని తిప్పుతూ ఇంటింటా కర్పూర హారతులు సమర్పించడం జరిగిందని శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, రామచంద్రగౌడ్ తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధయ్య, వెంకట రమణ, హరీష్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాదికి టీడీపీ లీగల్ సెల్ నివాళి

**కడప లీగల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త**



జిల్లాలోని బద్వేల్ కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డికి ముఖ్య న్యాయ సలహాదారుడు డీఏ కుమార్ మృతికి రాష్ట్ర తెదేపా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సీనియర్ న్యాయవాది జి.ఎస్.మూర్తి, జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మాజీ జీపీ గుర్రప్ప, లీగల్ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణరావు, శివరామకృష్ణ, వర్మ, మురళీలు ఘన నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ సెల్ ప్రధాన కార్యదర్శి జి.ఎస్.మూర్తి మాట్లాడుతూ మృతి చెందిన సీనియర్ న్యాయవాది డీఏ కుమార్(88) మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డికి న్యాయ సలహాదారునిగా ఉంటూ తెదేపా కార్యకర్తలకు న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించేవారన్నారు. తన జీవితంలో 65 ఏళ్ల పాటు బద్వేలులో న్యాయవాదిగా, ప్రముఖ న్యాయవాదిగా ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిలర్‌గా బద్వేల్ బార్‌కు సుమారు 50 సంవత్సరాలుగా ఏకగ్రీవ అధ్యక్షుడిగా ఎంపికై న్యాయవాదుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈయన హయాంలో బద్వేల్ కోర్టుకు శాశ్వత కోర్టు సముదాయాల ఏర్పాటుకు అలాగే అదనపు మెజిస్ట్రేట్ కోర్టు, పాస్ట్‌ట్రాక్ కోర్టు, శాశ్వత సబ్ కోర్టు ఏర్పాటుకు అహర్నిశలు కృషి చేసి సాధించారన్నారు. మృతి చెందిన డీఏ కుమార్ నీతి నిజాయితీతో ఆయన ప్రాణంగా నిబద్ధతతో పని చేసి న్యాయవాద వృత్తికి ఎనలేని గౌరవం తీసుకొచ్చారన్నారు. న్యాయవాద వృత్తే పరమావధిగా న్యాయ స్థానాలే ఆయువుగా పనిచేసిన డీఏ కుమార్ చిట్టచివరిగా తాను కష్టపడి తీసుకొచ్చిన శాశ్వత సబ్‌కోర్ట్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొని అతిథులను ఆహ్వానించి కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కోర్టు ప్రాంగణంలోనే తుదిశ్వాస విడవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈయన మృతి పట్ల న్యాయవాద వర్గాలతో పాటు తెదేపా కార్యకర్తలకు తీవ్ర లోటన్నారు. డీఏ కుమార్ పార్థివ దేహానికి ఘన నివాళి అర్పించి ఆయన కుమారుడు డీఏ కృష్ణను పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని, మనోనిబ్బరాన్ని ఇవ్వాలని దేవున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో బద్వేలు కోర్టు న్యాయవాదులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విధులను బహిష్కరించనున్న న్యాయవాదులు

**కడప లీగల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**

బద్వేల్ బార్ ప్రెసిడెంట్ సీనియర్ న్యాయవాది డీఏ కుమార్ మృతి చెందడంతో ఆయనకు గౌరవ సూచికంగా సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించనున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెనెడీలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు హాలులో సీనియర్ న్యాయవాది డీఏ కుమార్ సంతాప సభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సంతాప సభకు న్యాయవాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**జమ్మలమడుగు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు 17వ వార్డులో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

# ఘనంగా వినాయకునికి పూజలు

**కమలాపురం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త**



కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం వినాయక చవితి సందర్భంగా టీడీపీ నియోజకవర్గ కాపు ప్రధాన కార్యదర్శి దాది రామయ్య ఏర్పాటు చేసిన విగ్రహా నికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఘనంగా పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలంతా విఘ్నాలు తొలగి వినాయకుని ఆశీస్సులతో సుఖశాంతులతో ఉండాలని ఆ దేవుని ప్రార్థించినట్లు తెలిపారు.

# గంగ ఒడికి ఘననాథుడు

(మొదటి పేజీ తరువాయి)

పొంతన లేకుండా ప్రతి బిల్లులోనూ తేడా వస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించిన బిల్లుల్లోనూ తేడాలు కనిపిస్తున్నాయి. కమర్షియల్ కేటగిరిలో విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నప్పటికి ఫిక్స్‌డ్ చార్జీలు మారుతూ వస్తున్నాయి. బిల్లు ఎందుకు పెరుగుతోందన్న దానికి అధికారుల వద్ద సరైన సమాధానం లేదు. బిల్లు సమయం దాటిపోయి రెండు రోజుల అయితే కట్ చేస్తామని వినియోగదారుని వద్దకు గుంపులు, గుంపులుగా వచ్చే అధికారులు వినియోగదారుడు సమస్యపై వెలితే స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. బిల్లులు రీడింగ్ కాంట్రాక్టర్లకు వదిలివేయడంతో వారు ఇష్టారాజ్యాంగా వ్యవహిరస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ అధికారుల నిఘాలోపం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని తెలుస్తోంది. విద్యుత్ చౌర్యం, లైన్‌మెన్ ఇతర నష్టాలను బిల్లులు చెల్లించే వినియోగదారులపై రుద్దుతున్నట్లు ఆరోపణలున్నాయి. స్లాబ్‌రేట్ మార్చి బిల్లులు రెట్టింపు స్థాయిలో జారీ చేసి వందశాతం రెవెన్యూ కలెక్షన్ నమోదైనట్లు రికార్డుల్లో చూపిస్తుండడం కొసమెరుపు. డిస్కంలో విద్యుత్ బిల్లింగ్ ఇదివరకు టెలిస్కోపిక్ పద్ధతి అమల్లో ఉండేది. విద్యుత్ వినియోగం స్లాబుల వారీగా యూనిట్లు ధరలు ఉండేవి. బిల్లు ఎప్పుడు తీసినా వినియోగదారుడికి పెద్దగా భారం అయ్యేదికాదు. ఆదాయం పెంచుకునేందుకు డిస్కం గత కొన్నేళ్ళుగా నాన్‌టెలిస్కోపిక్ పద్ధతిని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం విద్యుత్ వినియోగం అధిక స్లాబ్‌లోని దరనే లెక్కకడుతున్నారు. దీంతో బిల్లింగ్ నెలరోజులు దాటిందంటే వినియోగదారుల స్లాబ్‌లు మారిపోతున్నాయి.

# ఘనంగా గణేష్ గణనాథుల నిమజ్జనం

**రామాపురం, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:**

రామాపురం మండలం కేంద్రంలో గణేష నిమజ్జన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, సర ్పంచ్ సంఘం అధ్యక్షుడు భూషణ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే చిట్లూరు, సరస్వతిపల్లి, బండపల్లి, హసనాపురం గ్రామంలోని పెదవలవాండ్లపల్లిలో శివారెడ్డి ఆధ్వర ్యంలో గణేష్ నిమజ్జనం చేశారు. ఆదివారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదు రోజుల నుంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బజా బజే ం త్రల మధ్య ఊరేగింపు చేశారు. ఆయా గ్రామాల పరిధిలో చెరువులలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజక వర్గ అసెంబ్లీ అధ్యక్షుడు జావిర్, రెడ్డిశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దినేష్, అనిల్, అశోక్ పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐసీడీఎస్‌లో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

## – సీడీపీవో నాగవేణి

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త**



తంబళ్లపల్లె పరిధిలోని తంబళ్లపల్లె, ములకల చెరువు, పీటీఎం, పెద్దమండెం మండలాలకు చెందిన ఒక అంగన్‌వాడీ, ఒక మినీ అంగన్‌వాడీ, 21 హెల్పర్ పోస్టులు ఖాళీ అయ్యాయని సీడీపీవో నాగవేణి తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ తరుగువారిపల్లె కార్యకర్త(ఎస్సీ), మండెంవారిపల్లె హెల్పర్(ఓహెచ్), తంబళ్లపల్లె-3(బీసీబీ), రెడ్డికోట (బీసీ డీ), కె.రామిగానిపల్లి (బీసీ బీ) పెద్దమండెం మండలం హెల్పర్ బత్తినిగారిపల్లె(ఎస్టీ) తుంస్సా వారిపల్లె (ఎస్సీ), రెడ్డివారిపల్లి-2 (బీసీ డీ), తురకపల్లె (ఓహెచ్), ములకల చెరువు మండలం మినీ అంగన్‌వాడీ కొత్త కురవపల్లి(ఓసీ), హెల్పర్స్ రెడ్డివారిపల్లి (బీసీ డీ), పీటీఎం మండలం పీటీఎం-1(బీసీ సీ), పీటీఎం-2(బీసీ ఈ), పీటీఎం-3(ఓహెచ్) కాట్లవాండ్లపల్లె (ఎస్సీ), గుగ్గిళ్లపల్లి (ఎస్సీ) ఖాళీలకు స్థానిక వివాహితులై 2022 జులై 1 నాటికి 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలని, కార్యకర్త పోస్టుకు కచ్చితంగా 10వ తరగతి పాసై ఉండాలన్నారు. హెల్పర్, ఓహెచ్ కేటగిరి అభ్యర్థులే దరఖాస్తు చేసుకోవాలని సదరం సర్టిఫికెట్ కచ్చితంగా జత చేయాలని ఈ ఎంపిక రూరల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో జరుగుతాయన్నారు. ఈనెల 12వ తేదీ లోపు విద్యార్హత, కులం ధ్రువపత్రాలతో ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తెలిపారు.

# గణేష్ యూత్ వినాయక నిమజ్జనం

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో గణేష్ యూత్ ఏర్పాటు చేసిన నిలువెత్తు వినాయక వినరగహ నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. తంబళ్లపల్లెలో మొహరం, వినాయక చవితి ఏ పండగ జరిగినా హిందూ ముస్లింలు ఐకమత్యంతో పండగ జరుపుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. వనివారం రాత్రి చివరిగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు లడ్డూ వేలం పాటలు జరిగాయి. ఆదివారం చివరిగా విగ్రహానికి మండల కేంద్రంలోని వందలాది మంది మహిళలు పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రత్యేక వాయిద్యాలతో పెద్ద ఎత్తున బాణాసంచాతో క్రాస్ రోడ్డు, తంబళ్లపల్లె పురవీధుల్లో వినాయక విగ్రహాన్ని ఊరేగింపు అనంతరం సమీపంలోని అక్కమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. మండలంలోని చివరి విగ్రహం కావడంతో ఉదయం నుంచి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు పూజలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. వెంకటేశ్వరవీధి, ఇట్నేని వారిపల్లి విగ్రహాలు సైతం గణేష్ యూత్ విగ్రహాన్ని అనుసరించాయి.

# పవిత్రోత్సవాలకు వేంకటేశ్వర ఆలయం ముస్తాబు

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త**



తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో సోమవారం నుంచి స్వామి వారి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం చలువపందిళ్లు, విద్యుత్తు దీపాలంకరణ, పూల అలంకరణతో పాటు టీటీడీ ప్రధాన అర్చకులకు సౌకర్యాలు, పవిత్రోత్సవాలకు హాజరయ్యే భక్తులకు తాగునీరు ఇతర సౌకర్యాలన్నీ ఆలయ డిప్యూటీ ఈవో ముందస్తు చర్యలు చేపట్టారు. సోమవారం ఆలయంలో పవిత్రోత్సవాలను టీటీడీ ప్రధాన అర్చకుడు ఏవీఎస్ మనికంఠ భట్టార్, ఆగమ అడ్వైజర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# లంబోదరా ఉంటామయ్యా

**కడప సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



కడప నగర శివారులోని కె ఎస్ ఆర్ ఎమ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొదటిసారి గణేష్ నిమజ్జన కార్యక్రమం వినాయక చవితి ఉత్సవ కమిటీ బృందం వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి నాని మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఈ ఏడాది ఊరువాడలో వినాయక చవితి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు పొంది స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. మానవ జీవితంలో ఏ శుభకార్యమైన మొదటగా వినాయకుని ఆశీస్సులు కోరుతామని తెలుపుతూ అందరి సహకారంతో నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయకునికి హెూమం జరిపించారు. ఐదవ రోజైన ఈరోజు ఉట్టి పోటీలను నిర్వహించారు, అనంతరం స్వామివారి లడ్డు వేలం పాటలో వేల్పుల రాము జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ వారి కుటుంబ సభ్యులు రూ.88 వేలకు స్వామివారి ప్రసాదమును దక్కించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరరీ కందుల రాజేశ్వరమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళకు రక్తదానం చేసిన ఎస్ఐ

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



పట్టణంలోని సాయిశ్రీ హాస్పిటల్ నందు ఒక మహిళకు ఓ పాజిటివ్ రక్తం అవసరం అవగ వారు పట్టణంలో శ్రీ రామచంద్ర మెడికల్ ఏజన్సీ నిర్వాహకుడు పరి జనార్దన్‌ని, ప్రణవి మెడికల్ పబ్బతి సురేష్‌ను సంప్రదించారు. వారు డొక్కా సీతమ్మ అన్నదాన, రక్తదాన సేవాసంస్థ పర్యవేక్షకుడు గంజి సురేష్ కుమార్‌ను సంప్రదించగా, ఈ విషయాన్ని ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రెడ్డి సురేష్‌కి తెలియచేయగా, ఆయన వెంటనే మహిళకు తన ఓ పాజిటివ్ రక్తాన్ని, రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి, స్థానిక సురక్ష వాలంటరీ బ్లడ్ సెంటర్ నందు రక్తదానం చేశారు. అధికారి హెూదాలో రక్తదానం చేసిన ఎస్సై రెడ్డి సురేష్‌ని డొక్కా సీతమ్మ అన్నదాన, రక్తదాన సేవాసంస్థ వ్యవస్థాపకురాలు రెడ్డి ప్రసన్న, వైస్ ఛైర్మన్ నల్లంశెట్టి రామ్ మనోజ్ కుమార్ శాలువతో ఎస్సైని సత్కరించారు. మంచి హృదయంతో స్పందించి రక్తదానం చేసిన టూటౌన్ ఎస్ఐ రెడ్డి సురేష్‌కి డొక్కా సీతమ్మ, అన్నదాన, రక్తదాన సేవాసంస్థ తరుపున కృతజ్ఞతలు తెలియచేశారు.

# 10న మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్**

**బద్వేల్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 10న ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం నందు జరిగే మున్సిపల్ ఉపాధ్యా యుల రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయాలని కోరుతూ బద్వేల్‌లోని స్థానిక ఎన్జీవో కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాలల విద్యాశాఖ పర్యవేక్షణలోనికి తీసుకువస్తూ ప్రభుత్వం జిఓ 84 జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల విడుదలకు ముందే మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం, అప్‌గ్రేడేషన్, ప్రధానోపాధ్యాయులకు డిడిఓ పవర్స్, అర్బన్ ఎంఇఓ, డివైఇఓ ప్రమోషన్స్, రూ.398/- నోషనల్ ఇంక్రిమెంట్లు, 2009 నుండి రావాల్సిన డిఏ, ఇతర బకా యిలు, నూతన పాఠశాలల స్థాపన, ఉపాధ్యాయుల నియామకం సమస్యలతో బాటు బదిలీలు, ప్రమోషన్లు సమస్యలు పెండింగ్‌లో వున్నాయన్నారు. జీతాల సమస్యలు, సెలవులు, సేవా పుస్తకంలో ఎంట్రీలు తదితర సమస్యలు ప్రస్తుతం ముందుకు వచ్చాయని తెలిపారు. వీటిపై సదస్సులో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మాత్యులు శ్రీ బొత్స సత్యనారాయణ, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్. లక్ష్మణరావు, వై.శ్రీనివాసులు రెడ్డి, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, మున్సిపల్ సబ్ కమిటీ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న మున్సిపల్ ఉపాధ్యాయులు హాజరై రాష్ట్ర సదస్సుని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శశిధర్ కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి జి.శ్రీనివాసులు, బద్వేలు మండల అధ్యక్షులు టి.శివ ప్రసాద్, గోపవరం మండల అధ్యక్షులు వీరదాసరి కిష్టఫర్ పాల్గొన్నారు.

# గురువుకు ప్రత్యామ్నాయమే లేదు

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



సాంకేతిక విజ్ఞానం ఎంత పెరిగినా గురువుకు ప్రత్యామ్నాయం కానే కాదని కడప డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ ముందస్తు వేడుకలకు ముఖ్య అతిథిగా రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి రాజ గోపాల్ రెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. తర్వాత కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచానికి దశ దిశ నిర్దేశించే మహెూన్నతుడే గురువు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం కేవలం గురువులకు మాత్రమే ఉందని కాబట్టి గురువులు తమ విధిని దైవంగా భావించాలన్నారు. తరువాత ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డి పాఠశాల సహాయ కుల స్థాయి నుంచి ఉప విద్యాశాఖాధికారి పదవిని అలంకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# డి.ఏ.కుమార్‌కు తుది వీడ్కోలు

**భౌతిక కాయం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే**

**బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 04 ప్రభాతవార్త**



విద్యావంతుడు, అందరికీ సుపరిచితుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది డి.ఏ.కుమార్ శనివారం ఉదయం బద్వేలు న్యాయస్థాన ప్రాంగణంలో హఠాన్మరణం చెందిన విషయాన్ని ప్రముఖులు, సన్నిహితులు, న్యాయవాదులు, మిగతా ఉద్యోగులు విషయం తెలుసుకొని ఆదివారం ఉదయం వారి భౌతిక కాయం వద్ద తమ అశ్రు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే డా॥ సుధ, సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ సుందరరామి రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, రాయలసీమ పాఠశాలల యాజమాన్యం మరియు తదితర ప్రముఖులు దివంగత న్యాయవాది డి.ఏ.కుమార్ స్వగృహంలో ఆయన భౌతిక కాయాన్ని దర్శించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అశ్రు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన జీవిత కాలంలో 60 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలోనే ఉంటూ వివిధ రకములైన వ్యాజ్యములను వాదించుటయేగాక అనేక మంది కక్షిదారులకు న్యాయం చేకూర్చుట, రాజీపడదగ్గ అన్ని వ్యాజ్యములలో కక్షిదారులను వ్యయ ప్రయాసల నుండి తప్పించి రాజీ మార్గాన్ని కుదుర్చి ప్రజల మన్ననలు పొందారని, ఎంతో మంది న్యాయవాదులకు గురువుగా ఉంటూ తన అపార జ్ఞానాన్ని వారికి పంచిపెట్టడమేగాక యువ న్యాయవాదులకు న్యాయవాద వృత్తిలో అనేక నిపుణతలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ భావితరాల వారికి తాను మార్గదర్శకుడై నిలిచాడని బద్వేలు న్యాయవాద సంఘానికి ఆది నుండి ఆదిపురుషుడై అధ్యక్షత వహించి నేటి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన స్థల వసతికి గానీ, కోర్టు ఏర్పాటుకు గానీ మిగతా సభ్యులతో కలసి అవిరళ కృషి గావించి తన కల ఫలించే సమయంలో ఈయన హఠాన్మరణము జీర్ణించుకోలేనిదని, చిరస్మరణీయుడని, అనేక వ్యాజ్యముల పరిష్కారములలో తనదైన శైలిలో వాద, ప్రతివాదనలను వినిపించి న్యాయానికి న్యాయం చేకూర్చేవారని, ఈయనను భావితరాల న్యాయవాదులు గుర్తుంచుకొని ఆయన పేరుకు వన్నె తేవాలని ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులు ఆయన వివిధ రంగాలలో చేసిన సేవలను కొనియాడుతూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి తుది వీడ్కోలు పలుకుతూ అశ్రు నివాళులు అర్పించారు. బద్వేలు బార్ అసోసియేషన్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఈయన మరణం న్యాయవాద వ్యవస్థకే తీరని లోటు అని వాపోయారు. వీరి వెంట మున్సిపల్ వైస్ ఛైర్మెన్ సాయి కృష్ణ, బిజ్జం రమణతో పాటు పలువురు న్యాయవాదులు, నాయకులు, పుర ప్రజలు భారీ స్థాయిలో పాల్గొని ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 1 నుంచి ఇంటర్మీడియట్ వరకు చెవిటి,మూగ బాలబాలికలకు ప్రవేశాలు

**కడప సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**

హెలన్‌కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, కడపలో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రాయలసీమ ప్రాంత జిల్లాల చెవిటి-మూగ (బధిర) బాలబాలికలకు ఉచిత విద్య, హాస్టల్ వసతి కల్పిస్తారు. తమ చెవిటి మూగ (బధిర) బాలబాలికలకు 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చేర్చదలచిన తల్లిదండ్రులు తమ పిల్లలను పిలుచుకుని అన్ని ఒరిజినలల్ సర్టిఫికెట్లను, ఫోటోలను తీసుకుని హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, రాజీవ్ గృహకల్ప రోడ్డు, సెంట్రల్ జైలు దగ్గర, రామాంజనేయపురం, కడపకు రావలయునని హెలెన్ కెల్లర్స్ విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ కం కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్‌ఖాన్ తెలియజేశారు. ఇతర వివరాలకు 9966006758 అను నెంబరును సంప్రదించవలెను.

# కోలాహలంగా గణనాథుని నిమజ్జనం

**ములకల చెరువు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**



వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆదివారం 5వ రోజు ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం వినాయక విగ్రహాల నిమజ్జన కార్య క్రమం కోలాహలంగా సాగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉద్యోగులు, చిన్నారులు, యువకులు సందడి చేశారు. చిన్నారులకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనం తరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్తూ, టపాకాయలు పేల్చుతూ, చిన్నారులు, యువకులు నృత్యాలు చూపరులను అలరించాయి. నిమజ్జనం అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఎస్సై డీవైస్వామి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కన్నుల పండువగా గణేశ్ నిమజ్జనం

బద్వేలు, సెప్టెంబరు 04 ప్రభాతవార్త :



పట్టణంలోని మిద్దెలవారిపాళెం శ్రీ వరసిద్ది వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా 5వ రోజు ఆదివారం లడ్డు ప్రసాదం వేలంపాట నిర్వహించడం జరిగింది. ఈ వేలంపాటలో గుమగుమలు రెస్టారెంట్ అధినేత వేముల నరేంద్ర 50 వేల రూపాయలతో స్వామివారి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. స్వామివారి కుంకుమ భరణి, చెరకు గడెలు, వెలగపండు తదితర ప్రసాదాలను పలువురు భక్తులు వేలంపాట ద్వారా సొంతం చేసుకొని తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం స్వామివారి నిమజ్జన కార్యక్రమం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య కన్నుల పండువగా జై భోలో గణపతి మహారాజ్ కీ జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కోలాహలంగా బాణసంచా కాలుస్తూ అందరినీ ఆకట్టుకునేలా నత్యాలతో గణనాధుని నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పునగాని శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జ్ ఆవుల కిట్టు, ఆదినారాయణ, తిరుపతి నారాయణ, వెంగల్‌రావు, సాయి, హరి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డింపుల ప్రభుత్వాలను సాగనంపాలి

వేంపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :



కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాలు వడ్డింపులు, వాయింపుల ప్రభుత్వాలుగా తయారై ప్రజలను వేధిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం మండ్రగబ్బలా, జగన్ ప్రభుత్వం తేలులా వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో వంటగ్యాస్ ధర రూ.410 ఉండగా బీజేపీ హయాంలో రూ.1150కి చేరిందన్నారు. కాంగ్రెస్ హయాంలో లీటరు పెట్రోలు ధర రూ.70 ఉండగా ప్రస్తుతం రూ.110 దాటిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోపిన వ్యాట్, అదనపు వ్యాట్, రోడ్డు సెస్సుతో రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇలా ఏవిధంగా చూసినా ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయన్నారు.

## సమాజానికి మార్గదర్శకులు గురువులు

**జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి**

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త



సమాజానికి మార్గదర్శకులు చదువు చెప్పే గురువులు అని అందుకే ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి దిశ నిర్దేశంగా మారి భావి భారత పౌరులను తీర్చిదిద్దాలని జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ముందస్తుగా ఆకేపాటి ఎస్టేట్‌లో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలోని 200 మంది ఉపాధ్యాయులకు ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు ద్వారా సన్మాన కార్యక్రమాన్ని జడ్‌పి ఛైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కడప మేయర్ కె.సురేష్‌బాబు, జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి 200 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సన్మానసభలో అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు అవసరమైన విద్యను అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడు పథకం ద్వారా విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కార్పొరేట్ తరహా విద్యను ప్రతి విద్యార్థికి ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. పాఠశాలలో అందించే నాణ్యమైన విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అవుతుందన్నారు. అందుకే సిఎం జగన్ రాష్ట్రంలో విద్యార్థులకు మేము ఇచ్చే ఆస్తి చదువేనని చెప్పారని గుర్తు చేశారు. వ్యవస్థలో మార్పులు తీసుకురావడం, విద్యార్థులను ఉన్నతస్థాయికి తీర్చిదిద్దేందుకే అన్నారు. అందుకే ప్రతి ఉపాధ్యాయుడు పిల్లలకు మంచి విద్యను అందించి కలకాలం వారి మనుషుల్లో నిలిచిపోయి వారు ఉన్నత శిఖరాలకు చేరినప్పుడు ఆస్వాధించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు కార్యదర్శి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ఎస్‌టియు నేత శివారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్ ఛైర్మన్ మర్రి రవి, మీనేస్తం ఛైర్మన్ పెనిగలపాటి పెంచలయ్యానాయుడు, ప్రాంతీయ వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తిరాజు, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, పిల్లి రామక్రిష్ణ, డిప్యూటి సిఇఒ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గణపతయ్య నిమజ్జనం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



పెండ్లిమర్రి మండలంలోని పెండ్లిమర్రి, కొత్తసంగటిపల్లె దళితవాడ, యాదవపురం తదితర గ్రామాల్లో ఆదివారం వైభవంగా గణపతయ్య స్వామి నిమజ్జనం చేశారు. భక్తులందరూ స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. బాణాసంచాలతో డప్పు వాయిద్యాలతో నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలుకుతూ నిమజ్జనం

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



వినాయక చవితి పండగ సందర్భంగా కడప నగరంలోని మృత్యుంజయ కుంటలోని రాజుల వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు కార్యనిర్వాహకులు రామకృష్ణ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం శ్రీవరసిద్ధి వినాయక స్వామి లడ్డు వేలం పాటను గణేష్ యూత్ నిర్వహించారు. మొదటగా నిర్వహించిన వేలంపాటలో రూ.62వేలకు బాలురాజు పాండు వర్మ స్వామి లడ్డు ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. మరో లడ్డు వేలం పాటలో రూ.25వేలకు భాగ్యలక్ష్మి లడ్డు ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. ముందుగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం గణేష్ యూత్ ఆధ్వర్యంలో కోలాహలంగా మంగళ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో నిమజ్జనం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు రామకృష్ణ నాయుడు, నరేష్ రాజు, రవికుమార్ నాయుడు, మదన్ రాజా, రాము, బాల, స్థానిక నివాస ప్రజలు, పిల్లలు, మహిళలు, పెద్దలు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డికి సన్మానం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడిగా లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి ఎంపిక సందర్భంగా మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు. గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, ఎర్రగుడిపాలెం గొల్లపల్లి ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, శంకర నాయుడు, వైసీపీ యువ నాయకులు సుదర్శన్‌రెడ్డిని సన్మానం చేశారు.

## నేడు మాలమహానాడు జిల్లాసభలు

కలికిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



మండలంలో ఈనెల 5న సోమవారం మండలంలోని హేమామాంబచారి కళ్యాణ మండపంలో మాల మహానాడు జిల్లాసభలు జరుగునని ఆసంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు హరి పేర్కొన్నారు. సభలను విజయవంతం చేయాలని ఇదివరకే జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఆదివారం మండలంలోని మర్రికుంటపల్లె పంచాయితీలో పర్యటించి మాల సోదరులందరికి కరపత్రాలను పంపిణీ చేసి సోమవారంజరిగే సభలకు హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌టి.రమణ, మర్రికుంటపల్లె సర్పంచ్ రెడ్డిరామ్, సహదేవ, రామక్రిష్ణ, చంద్రయ్య, శంకరయ్యపాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

కలికిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



మండలంలో ఆదివారం గణేష్ నిజమ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను భక్తులు ట్రాక్టర్‌లో చేర్చి చెక్కభజనలు, భళ్ళారి డ్రమ్స్‌తో ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా వాల్మీకిపురం సిఐ బిఎస్.సురేష్ పర్యవేక్షణలో ఏఎస్‌ఐలు మధుసూదనాచారి, మహబూబ్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, మనోహర్‌లు బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగింది.

## ఉండ్రాళ్ళయ్యా... ఉంటామయ్యా

**భక్తిశ్రద్ధల నడుమ గణేష్ నిమజ్జన వేడుకలు**

**అన్నదానం వితరణ**

**వేలంలో 42 వేలు పలికిన గణనాధుని లడ్డూ**

చిట్వేలి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త



చిట్వేలి మండలం అనుంపల్లె గ్రామంలో గణేష్ నిమజ్జనం వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో, శాంతి సామరస్యంతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం కీ.శే మాదినేని రామక్రిష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించగా తదుపరి దేవుని లడ్డూ వేలం నిర్వహించగా గ్రామస్థులు పోటీ పడి 42 వేలకు నానబాల రమేష్‌బాబు సొంతం చేసుకొన్నారు. దేవుని విగ్రహ ఖర్చు, పూజా కార్యక్రమాలు రమేష్‌బాబు కుటుంబ సభ్యులు నిర్వహించారు. తర్వాత సాయంత్రం దేవుని ఊరేగింపు అనుంపల్లె గ్రామ పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువత డప్‌ల వాయిద్యాలకు చిందులేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో గట్టిబందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదినేని సుధాకర్, మాదినేని కుమార్, గుత్తి సుబ్బరాయుడు, నానబాల శ్రీనివాసులు, పసుపులేటి ఈశ్వరయ్య, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**– అపోలో హాస్పిటల్ డా॥ వివేకానందరెడ్డి**

బద్వేలు అర్బన్, సెప్టెంబరు 04 ప్రభాతవార్త :



ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వలన ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ కీళ్ళ మార్పిడి ఆర్థోస్కోపిక్, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ వివేకానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నిర్వాణ హాస్పిటల్‌లో నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డా॥ వివేకానంద రెడ్డి పలువురు ప్రజలకు కీళ్ళ మార్పిడి, ఆర్థోస్కోపిక్, వెన్నెముక సమస్యలతో ఉన్నవారికి పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో వయసు పైబడిన ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కీళ్ళ వాతం, వెన్నెముక, మోకాళ్ళ నొప్పులు, తుంటి ఎముక నొప్పులు, బోన్ ట్యూమర్ జబ్బులు, తుంటి కీళ్ళు, ఇతర కీళ్ళ మార్పిడి, క్యాన్సర్ సోకిన ఎముకలు, కీళ్ళు తీసివేయకుండా ప్రత్యేకంగా తయారుచేసిన కీళ్ళతో అంగవైకల్యం ఉండదని, పలు రకాల సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు డాక్టర్లను సంప్రదిస్తూ వారి సలహాలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. తినే ఆహారంలో కూడా మార్పులు చేసుకోవాలని, ఆకు కూరలు లాంటి పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చని పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాణ హాస్పిటల్ డా॥ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డి, అపోలో హాస్పిటల్ మేనేజర్ రామాంజనేయ రెడ్డితో పాటు పలువురు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథులు నిమజ్జనం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



వినాయక చవితి పురస్కరించుకొని మండలంలో దాదాపు 200 పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆదివారం 5వ రోజు కావడంతో దాదాపు 50 విగ్రహాలకు పైగా నిమజ్జనం చేశారు. గద్దగుండ రాచపల్లి, గొల్లపల్లి, బూడిదగఉుంటపల్లి, ఈడిగపల్లి, మద్దిరేవుల జీఎంఆర్ కాలనీ, చౌటపల్లె, వడ్డేపల్లి గ్రామాల్లోని వినాయకుడి విగ్రహాల వద్ద అన్నదానం నిర్వహించారు. వినాయకుడి నిమజ్జనం ఊరేగింపులో యువకులు ఉత్సాహంతో రంగులు చల్లుకుంటూ జై గణేష్ మహారాజ్‌కీ అంటూ జేజేలు పలుకుతూ లక్కిరెడ్డిపల్లె సమీపంలోని దొరి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యనిర్వాహకులు యువకులు ఉత్సాహంగా పాల్గొని నిమజ్జనం నిర్వహించారు.

## పెండ్లిమర్రిలో కబడ్డీ పోటీలు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



మండలంలోని పెండ్లిమర్రిలో యూత్ ఆధ్వర్యంలో వినాయక స్వామి పండగ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి, సర్పంచి నాగమల్లారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

## ఘనంగా గణనాదుల నిమజ్జనం

గాలివీడు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:

మండలం లో వివిధ గ్రామ పంచాయితీలలో నెలకొల్పిన గణనాదు ల నిమ్మజ్జన కార్యక్రమం ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు.గత ఐదు రోజులుగా వివిధ రూపాలలో ఎరాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద వివిధ రకాల లంకరణలతో పాటు,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెలిగల్లు గ్రామ పంచాయతీ లో ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పసలవాండ్ల పల్లె విగ్రహం వద్ద యూత్ లీడర్ మంచురి వెంకటరమణా రెడ్డి,1,10,000 రూపాయల కు దక్కించుకోగా,అదే గ్రామానికి చెందిన ఇంకో మండపం వద్ద అమర్ నాథ రెడ్డి అనే వ్యక్తి 2,30,000, రూపాయల కు లడ్డూ ను దక్కించుకున్నారుమండల కేంద్రము లోని కొన్ని విగ్రహాల వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిన వైసీపీ ప్రభుత్వం

బి.కొత్తకోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



నిత్యావసర ధరలు, ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలు పెంచడం వలన వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం మోపిందని టీడీపీ మండల అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి, అసెంబ్లీ పోల్ కోఆర్డినేటర్ కుడుము శ్రీనివాసులు ఆరోపించారు. ఆదివారం బి.కొత్తకోట మండలంలోని మొటుకు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు భారీగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ఛాన్స్ అని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధరలు, పన్నులు విపరీతంగా పెంచి ప్రజల ఆర్థికస్థితిని చిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. పెంచిన పెట్రోల్, డీజల్, నిత్యావసర ధరలు, ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొటుకు గ్రామంలో ఇంటింటికి వెళ్లి బాదుడే బాదుడు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి మస్తాన్, భాస్కర్‌రెడ్డి, రెడ్డన్న, మొటుకు శివ, షమీవుల్లా, రియాజ్‌అలీఖాన్, ప్రసాద్, బయారెడ్డి, బీరంగి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

**డిఎస్‌పి రవిమనోహరాచారి**

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



వినాయక నిమజ్జనంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్‌పి రవిమనోహరాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందోబస్తు విధి నిర్వహణ కోసం వచ్చిన అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వినాయక నిమజ్జనం కోసం ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సిఐలు మురళీక్రిష్ణ, ఈదూర్‌బాషా, సత్యనారాయణ, ఎస్‌ఐలు చంద్రమోహన్, సుధాకర్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరం

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :

పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో రమానేత్రాలయ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏపి ఏన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. రమానేత్రాలయ కంటి ఆసుపత్రి డాక్టర్ మహేష్‌రెడ్డి ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేవారు. ఈ క్యాంపులో 100మందికి పైగా పరీక్షలు చేయించుకొని ఇందులో 15మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ అధ్యక్షులు నరనసింహారెడ్డి, పెన్షనర్స్ అధ్యక్షులు బిటి.నరసింహులు, ఎన్‌జిఒసంఘం నాయకులు గిరిధర్‌రెడ్డి, శివప్రసాద్, ఆజాద్, ప్రసాద్, ఆది, వెంకటేశ్వర్లు, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరావతమ్మకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కురబలకోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



కురబలకోట మండలం ముదివేడు వద్ద ఉన్న ఏపి ఆదర్శ పాఠశాలలో హింది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్.ఇందిరావతమ్మకు ఉత్తమ టీచర్ అవార్డును అందుకొన్నారు. ఆదివారం తిరుపతిలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లె రాధాక్రిష్ణ జయంతిని పురష్కరించుకొని జగజ్జీవన్‌రావు భవనంలో సంకల్ప సేవాసమితి ఆధ్వర్యంలో తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఇందులో భాగంగా ఇందిరావతమ్మ గత 25ఏళ్ళుగా విద్యాభివృద్దికి ఎంతో కృషి చేశారని ఆమె కృషి ఫలితంగా ఎందరో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక రెవెన్యూ అధికారి కెఎల్.వర్మా, విశ్రాంతి సూపరిండెంట్ డాక్టర్ భారతి, విశ్రాంతి ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, పుత్తూరు డిగ్రీ కలాశాల ప్రిన్సిపాల్ బాస్కర్‌రెడ్డి, రఫి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారినగర్‌లో వినాయక నిమజ్జనం

**వేలంలో రూ.10116లు పలికిన లడ్డూధర**

మదనపల్లె, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్‌లో ఆదివారం కోలాహలంగా వినాయక స్వామి విగ్రహ ఊరేగింపు నిమజ్జనం జరిగింది. స్థానిక కాలనీ వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో బొజ్జగణపయ్య విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ట్రాక్టర్‌పై వీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్ళారు. బొజ్జగణపయ్య ముందు శ్రీవారినగర్ వాసులు బళ్ళారిడ్రమ్స్, కొలాటాలు, డాన్సులతో రంగులు చల్లుకొంటూ ఊరేగింపుగా వెళ్ళారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలంపాటలను నిర్వహించారు. ఈ వేలంపాటల్లో లడ్డూను రామిశెట్టి కేశవ పాడి రూ.10,116లకు దక్కించుకొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారినగర్ వినాయక కమిటీ సభ్యులు ఆర్.ప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, ముత్రా వెంకటరమణారెడ్డి, జీవి.శివారెడ్డి, గణపతిరెడ్డి, సురేంద్ర, క్రిష్ణశంకర్‌రెడ్డి, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్ అధ్యాపకునికి కల్పఆచార్య అవార్డు

కురబలకోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :

మిట్స్ కళాశాలలో పనిచేసే కంప్యూటర్ అండ్ సైన్స్ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొపెసర్ సౌమ్య రంజన్‌జేనా జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచడంతో అవార్డు అందుకొన్నారు. 2021–22 సంవత్సరానికి గానూ రీజర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెక్టార్‌లో ప్రతిభ కనపరచడంతో భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సి.యువరాజ్ తెలిపారు. విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్శిటిలో రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ ప్రొపెసర్ కె.హేమచంద్రారెడ్డి చేతల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకొన్నారు. ఆయనను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, డైరెక్టర్ కీర్తినాదేళ్ళ, ప్రిన్సిపాల్ అభినందించారు.

## అరాచకపాలనను అంతమొందిస్తాం

**దొమ్మలపాటి రమేష్**

నిమ్మనపల్లె, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



రాష్ట్రంలో అరాచకపాలనను అంతం చేసేందుకు కృషిచేస్తామని మదనపల్లె టిడిపి ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్ అన్నారు. ఆదివారం మండలంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారపక్షం అరాచకాలు అధికమయ్యాయని ప్రతి నియోజకవర్గంలో దాడులు జరుగుతున్నాయని పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన విరుచుకపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్‌రావు, మునిరత్న, మల్లికార్జున, వెంకటరమణ, విజయ్, భాస్కర్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కోలాహలంగా గణనాథుని నిమజ్జనం

ములకల చెరువు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆదివారం 5వరోజు ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉద్యోగులు, చిన్నారులు, యువకులు సందడి చేశారు. చిన్నారులకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్తూ, టపాకాయలు పేల్చుతూ, చిన్నారులు, యువకులు నృత్యాలు చూపరులను అలరించాయి. వినాయక శోభాయాత్ర నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగింది. నిమజ్జనం అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుకోకుండా ఎస్సై డీవై స్వామి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

## వైభవంగా వినాయకుల నిమజ్జనోత్సవం

బి.కొత్తకోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



బి.కొత్తకోటలో వినాయక నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల మధ్య వినాయక విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి అచ్చమ్మచెరువు, గుమ్మసముద్రం చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో వందలాది మంది ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## మానసిక వికలత్వ సర్టిఫికెట్లు మదనపల్లెలోనే ఇవ్వండిసారూ..

**వికలాంగులు వినతి**

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



మదనపల్లె జిల్లా ఆసుపత్రి సదరన్ క్యాంపులో మానసిక వికలత్వ (ఎంఆర్) సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ వికలాంగుల సంఘం అధ్యక్షులు మౌళాలి సూపరిండెంట్ ఆంజినేయులను కోరారు. మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రిలో వృద్దాప్యం, అంగవైకల్యం, చెవి, ముక్కు, గొంతు, కళ్ళు వంటి వైకల్యాలకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి సదరన్ క్యాంపులో సర్టిఫికెట్టు మంజూరు చేయడం జరుగుతోంది. మానసిక వికలత్వం(ఎంఆర్)కు సదరన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే తిరుపతిలోని స్విమ్స్‌కు వెళ్ళి డాక్టర్‌చే పరీక్షలు చేయించుకొని సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంది. జిల్లాల విభజనలో ప్రతి జిల్లాకు సదరన్‌క్యాంపులో ఎంఆర్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి డాక్టర్లు ఉన్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో మానసిక వికలత్వానికి చూడడానికి డాక్టర్ ఉన్నా రోగిని పరిశీలించి సర్టిఫికెట్లు ఇవ్వడానికి పర్మిషన్ ప్రభుత్వం కల్పించలేదని వికలాంగులు తెలిపారు. ఈ సర్టిఫికెట్‌ను పొందాలంటే మెంటలీ డిజైనబుల్ వ్యక్తితో పాటు మరోకరు తిరుపతికి వెళ్ళి చూయించుకొని రావాలంటే సుమారు రూ.1500ల ఖర్చు అవుతోందని వికలాంగులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వికలత్వం కలిగిన వికలాంగులను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు, సూపరిండెంట్, ప్రజాప్రతినిధులు జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు పరిశీలించి సర్టిఫికెట్టు సదరన్‌లో ఇచ్చే సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

**ఎంఆర్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అనుమతులు చేయాలి : మౌళాలి**

వికలాంగులు ఎన్నో వ్యయప్రయాసాలకు గురై తిరుపతికి వెళ్లి ఎంఆర్ సర్టిఫికెట్లను తెచ్చుకోవాలంటే వేలాది రుపాయలు ఖర్చు అవుతోందని, సదరన్ అన్ని సర్టిఫికెట్లతో పాటు ఎంఆర్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు స్లాట్స్‌ను బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సూపరిండెంట్‌ను కోరారు.

**అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం త్వరలో వస్తాయి : మెడికల్ సూపరిండెంట్**

వికలాంగుల సమస్య మా దృష్టికి వచ్చింది. వికలాంగుల కోరిక మేరకు ప్రతిపాధనలు ఉన్నతాధికారుల దృష్టికి తెలిపాము. వీలైనంత త్వరలో ఇక్కడే ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు రానున్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ ఆంజినేయులు తెలిపారు.

## కర్నాటక రోడ్డు ప్రమాదంలో కురబలకోట వాసి మృతి

కురబలకోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



కర్నాటకాలో శనివారం రాత్రి రాయల్పాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురబలకోట మండల వాసి మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు కనసానివారిపల్లె పంచాయితీ జంగావారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు జంగారెడ్డిశేఖర్‌రెడ్డి(28) తన ద్విచక్రవాహనంలో శనివారం రాత్రి బెంగుళూరుకు బయలుదేరాడు. మార్గమద్యంలో రాయల్పాడు వద్ద ఎదురుగా వచ్చిన గుర్తుతెలియిన వాహనం ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు రాయల్పాడు పోలీసులు అప్పగించారు. వెంకటరమణారెడ్డి, ప్రమీళమ్మలకు ఏకైక కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. జంగావారిపల్లెల్కో విషాదచాయలు అలుముకొన్నాయి.

## టిడిపి కార్యకర్త గుండెపోటుతో మృతి

నిమ్మనపల్లె, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



మండలంలోని వెంకోజివారిపల్లెలో టిడిపి కార్యకర్త శ్రీనివాసులు (53) ఆదివారం గుండెపోటుతో ఆయన స్వగృహంలో మృతి చెందాడు. మదనపల్లె టిడిపి ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్ ఆ గ్రామానికి చేరుకొని మృతునికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, నాయకులు మునిరత్నం, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా వినాయక చవితి వేడుకలు

బ్రహ్మంగారి మఠం, సెప్టెంబరు 04 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద వెలసి వున్న అభయ విఘ్నేశ్వరునికి 5 రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం వినాయకుని వద్ద ఉంచిన లడ్డు, చెరకు గడెలు, హుండీని వేలంపాటలో కొత్తూరు గ్రామానికి చెందిన బోలా శ్రీనివాసులు 47 వేల రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు. పల్లకొండ పెంచలయ్య కుమారుడు శ్రీ వీరబ్రహ్మేంద్ర కుమార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని పుర వీధులలో ఊరేగింపు కార్యక్రమంలో బాణసంచా కాలుస్తూ డిజే పాటలతో కసాపురం వారి బ్యాండుతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి, అనంతరం వినాయక చవితి కమిటీ సభ్యులు తెలుగు గంగ రిజర్వాయర్ నందు నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విద్యా సాగర్ ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహించారు.

## వైభవంగా వినాయకుని నిమజ్జనం

**శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో రూ.1.50 లక్షలు పలికిన గణేష్ లడ్డు**

బద్వేలు అర్బన్, సెప్టెంబరు 04 ప్రభాతవార్త :



బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో గత 5 రోజుల పాటు పలు వార్డులలో భక్తిశ్రద్ధలతో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక స్వామివారికి పలు రకాల విశేష పూజలు నిర్వహించి, ఆదివారం ఇక సెలవయ్యా... గణపయ్యా! అంటూ పలు వినాయక మంటపాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డు, చెరకు గడెలు, కుంకుమ భరణి, వెలగపండు, వెండి ద్వీపాలతో పాటు పలు రకాల సామాగ్రిని స్వామివారి వేలంపాట ద్వారా భక్తులు సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా బద్వేలు పట్టణంలో గత 5 రోజులలో ఎక్కడా లేని విధంగా శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో వినాయకుని వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని భక్తులు దక్కించుకోవడానికి పోటాపోటీ పడి ఆవుల బ్రదర్స్ ఎలక్ట్రిషన్ ఆవుల నరసయ్య, ఆవుల నాగరాజా, ఆవుల హరికృష్ణలు లక్షా 60 వేలు రూపాయలతో దక్కించుకోవడం జరిగింది. వారికి ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి శాలువా, పూలమాలలతో సత్కరించి బ్యాండుమేళాలతో వారి స్వగృహానికి చేర్చగా, అలాగే 24వ వార్డులో వినాయకుని వద్ద 5 రోజుల పాటు ఉంచిన లడ్డు ప్రసాదాన్ని 42 వేల రూపాయలకు తుమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య కుమారుడు సునీల్ దక్కించుకున్నారు. అలాగే వాసవీ అమ్మవారి ఆర్యవైశ్య యువజన సంఘం వారు ఏర్పాటు చేసిన వరసిద్ది వినాయక చవితి ఉత్సవాలలో స్వామివారి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని 18500 రూపాయలతో సాయి బాలాజీ రంగోలి కలర్స్ షాపు యజమాని తులసి వెంకట సుబ్బయ్య సొంతం చేసుకున్నారు. అలాగే నందిపల్లెలో స్వామివారి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని 40 వేల రూపాయలతో పంగా విష్ణువర్ధన్ రెడ్డి, అలాగే గాంధీ నగర్‌లో ఉత్సవాలలో స్వామివారి లడ్డు ప్రసాదాన్ని 48 వేల రూపాయలతో భక్తులు సొంతం చేసుకున్నారు. స్వామివారి నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు వెంకటరమణ, శ్రీకాంత్‌లు ప్రత్యేక బందోబస్తు ద్వారా నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. పలువురు భక్తులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ స్వామివారి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

## వైభవంగా వినాయకునికి పుష్ప యాగం

**పుష్ప యాగంలో పాల్గొన్న సాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పార్టనర్స్**

బద్వేలు అర్బన్, సెప్టెంబరు 04 ప్రభాతవార్త :



పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం గణనాధునికి రకరకాల పుష్పాలతో వైభవంగా పుష్ప యాగం కార్యక్రమాన్ని కన్నుల పండువగా చేపట్టారు. పుష్పయాగంలో ప్రత్యేక ఉభయదాతలుగా శ్రీసాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పార్టనర్స్ పత్తిరాజా గారి కృష్ణమూర్తి, పబ్బతి చంద్రశేఖర్, చిందుకూరి సుధాకర్, పబ్బతి సత్యనారాయణ, మెంటా ప్రసాద్, పబ్బతి హజరత్, సురేష్ కుటుంబ సభ్యులకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వినాయక చవితి ఉత్సవాలలో పాల్గొన్న భక్తులందరూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వినాయక స్వామికి పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి పూలు, కాయా కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు కె.వి.సుబ్బారావు, సగళా సురేష్ బాబు, దొంతంశెట్టి కిషోర్, సముద్రాల విజయ్ కుమార్, సురేష్, దర్శి సుమన్, పైడిమర్రి సురేష్, మల్లి, మస్తాన్‌రాజా, దొంతంశెట్టి జయకుమార్, వైభవ్ ప్రసాద్,కమిటీసభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## ఉపాధ్యాయ దినోత్సవం బహిష్కరించాలనడం సరికాదు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :



రాష్ట్రంలో ఉపాధ్యాయ దినోత్సవం బహిష్కరించాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునివ్వడం సరికాదని ఏపీ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుడు వెంకటనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాధారణ ఉపాధ్యాయుడి నుండి దేశంలో అత్యున్నత స్థాయి కలిగిన రాష్ట్రపతి వరకు ఎదిగిన మహనీయుడు సర్వేపల్లె రాధాకృష్ణన్ అని, ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయితిగా వస్తోందన్నారు. ఆయన స్ఫూర్తితో ఉపాధ్యాయులు ముందుకు వెళ్లడం సమాజానికి చాలా అవసరం అన్నారు. ప్రభుత్వం మీద ఉన్న కోపంతో ఉపాధ్యాయ వృత్తిని గౌరవించుకునే రోజైన ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరిస్తామని చెప్పడం ఏ మాత్రం సరికాదన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఈ విధంగా తెలియజేయాలనుకోవడం సరికాదన్నారు.

## తెలుగు పండితునికి ఉత్తమ పురస్కారం

పుల్లంపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త



మండలంలోని పివిజిపల్లె ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లె వెంకట రమణ ఆకేపాటి ఫౌండేషన్‌ట్రస్టు నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆదివారం అందుకొన్నారు. రాజంపేట మండలం నారంరాజుపల్లె వద్ద గల ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఎస్టేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందస్తుగా జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నిర్వహించి జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలను అందజేయడం జరిగింది. అందులో భాగంగా పుల్లంపేట మండలంలో కూడ మరికొంత మంది ఉపాధ్యాయులకు, ఎంఇఒ రంగనాథయ్యలు ఈ పురస్కారాలను అందుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌తో పాటు అన్నమయ్య విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, కడప నగర కార్పొరేషన్ ఛైర్మన్ కె.సురేష్‌బాబు, రాజంపేట మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐపి భాను మూర్తిరాజు తదితరుల చేతులమీదుగా గంగనపల్లెకు శాలువా, జ్ఞాపిక ప్రశంసాపత్రాలు అందుకోవడం జరిగింది.

## మండలంలో ఎంపిపి పర్యటన

నందలూరు, సెప్టెంబరు 4 ప్రభాతవార్త

నందలూరు మండలం మేజర్ గ్రామ పంచాయతి 13వ వార్డు డిసిఎం రోడ్డు పరిధిలోని మినీ అంగన్వాడి కేంద్ర విభాగాన్ని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు. అంగన్వాడి సెంటర్ వద్ద పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు అంగన్వాడి సెంటర్‌ను చెత్తకుండీగా తయారు చేశారని గ్రామస్థులు ఆయనకు తెలియజేయడంతో స్వయంగా ఆ ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. చిన్నపిల్లలు ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పారిశుద్ధ్య టాయిలెట్ లేకపోవడం బాధాకరమన్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రజలు అంగన్వాడి సెంటర్ వద్ద చెత్త వేయడం చాలా బాధాకరమని, దీనిపై పంచాయతివారితో చెప్పి త్వరలో పరిష్కారం చూపిస్తామన్నారు. అంగన్వాడి ప్రహరీచుట్టు ప్రహరీగోడ నిర్మించి మరియు మరుగుదొడ్లను నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అరవపల్లె ప్లేగ్రౌండ్ వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని, అందులోను వినాయకచవితి సందర్భంగా చేసిన అన్నదానం ఎంతో పుణ్యకార్యమని కమిటి సభ్యులనుద్దేశించి ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి అమీర్, మధుసూదన్‌రెడ్డి, పవన్, సుబ్రమణ్యం, చాపల మధు, మండల కోఆప్షన్ సభ్యులు కలిముల్లాఖాన్, అరవపల్లె వినాయకచవితి కమిటిసభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డికి ఘనంగా సన్మానం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడిగా లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి ఎంపిక సందర్భంగా మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు. గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, ఎర్రగుడిపాలెం గొల్లపల్లి ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, శంకర నాయుడు, వైసీపీ యువ నాయకులు సుదర్శన్‌రెడ్డిని కలిసి సన్మానం చేశారు.

## ఘనంగా గణనాథులు నిమజ్జనం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



వినాయక చవితి పురస్కరించుకొని మండలంలో దాదాపు 200 పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆదివారం 5వ రోజు కావడంతో దాదాపు 50 విగ్రహాలకు పైగా నిమజ్జనం చేశారు. గద్దగుండ రాచపల్లి, గొల్లపల్లి, బూడిదగుంటపల్లి, ఈడిగపల్లి, మద్దిరేవుల జీఎంఆర్ కాలనీ, చౌటపల్లె, వడ్డేపల్లి గ్రామాల్లోని వినాయకుడి విగ్రహాల వద్ద అన్నదానం నిర్వహించారు. వినాయకుడి నిమజ్జనం ఊరేగింపులో యువకులు ఉత్సాహంతో రంగులు చల్లుకుంటూ జై గణేష్ మహారాజ్‌కీ అంటూ జేజేలు పలుకుతూ లక్కిరెడ్డిపల్లె సమీపంలోని దొరి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యనిర్వాహకులు యువకులు ఉత్సాహంగా పాల్గొని నిమజ్జనం నిర్వహించారు.

## అన్నదానం మహా పుణ్యకార్యం

**– కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి**

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:



వినాయక చవితి పండగ సందర్భంగా కడప నగరంలోని నల్లరాతి మిద్దె వద్ద ఉన్న ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్కూలు వారు అన్నదాన కార్యక్రమం చేయడం ఎంతో పుణ్యకార్యమని కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కార్పొరేటర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్కూలు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ వెంకట శివారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మల్లికార్జునలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వినాయక స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకురాలు గడియారం తెజస్వీతో కలిసి ప్రారంభించి ప్రజలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్కూల్ నిర్వాహకురాలు గడియారం తేజస్విని వారు ప్రత్యేకంగా అభినందించారు. డ్యాన్స్ స్కూల్ ద్వారా చిన్నారుల్లో ఉన్న ప్రతిభను బయటకు తీసేందుకు వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ వారిని ప్రోత్సహించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి దైవ కార్యక్రమాలను సైతం నిర్వహించడం అభినందనీయమన్నారు.

## నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలి

పులివెందుల, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :



నేత్రదానం చేయడం కుటుంబ సంప్రదాయంగా మారాలని పులివెందుల నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం నేత్రదాన అవగాహన గోడపత్రాలను పలువురితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి మరణానంతరం వృథాగా మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధులకు చూపు ప్రసాదించినవారవుతారన్నారు. నేత్రదానం చేయదలచిన వారు స్నేహిత అమృతహస్తం సేవా సంస్థకు సమాచారం ఇస్తే మృతదేహం వద్దకు వారే వచ్చి కార్నియాలను సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండి వీరాంజనేయస్వామి దేవస్థాన ఈవో ముకుందారెడ్డి, సివిల్ సప్లైస్ డైరెక్టరు గంగాధర్‌రెడ్డి, వైకాపా కడప పార్లమెంట్ కన్వీనరు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, స్నేహిత అమృతహస్తం సేవా సంస్థ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహంలో మురుగునీటి సమస్యను పరిష్కరించండి

పులివెందుల, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :



పులివెందులలోని ఆటోనగర్ వద్ద ఉన్న బాలికల వసతి గృహంలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమీషనరు నరసింహారెడ్డిలతో కలిసి పట్టణంలోని రోటరీపురం, వెంకటాపురం కాలనీల్లో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారు.కార్యక్రమంలో మున్సిపల్ డీఈ గుర్రప్ప యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన వినాయకుని నిమజ్జనం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న గణనాధుల నిమజ్జన కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసినట్లు రైల్వేకోడూరు సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గత 3 రోజులుగా రైల్వేకోడూరు మండలంలో గణనాధుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఎట్టకేలకు ఆదివారంతో ముగిసిందని రైల్వేకోడూరు సిఐ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. ఓబులవారిపల్లె, కోడూరు, చిట్వేలి మండలాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు సిబ్బంది ద్వారా నిమజ్జన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

## జబర్దస్త్ టీముతో చెన్నవరంలో గణపతి ప్రత్యేక పూజలు

గోపవరం,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త;



మండలంలోని చెన్నవరం గ్రామంలో ఆదివారం జబర్దస్త్ కమెడియన్స్‌తో అంగరంగ వైభవంగా వినాయక స్వామి పూజలను నిర్వహించారు, కార్యక్రమానికి విచ్చేసిన జబర్దస్త్ టీమ్ ద్వారా నిర్వహించే గణపతి పూజలను చూసేందుకు పరిసర గ్రామాలనుంచి అదిక సఖ్యలో ప్రజలు తరలివచ్చారు,నరసింహ స్వామి ఆలయ పూజారి శ్రీ పెంచలయ్య ఆద్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది,కాగా జబర్దస్త్ టీమ్ వినోద్,గడ్డం నవీన్,అప్పారావులు మాట్లాడుతూ మహిమాణ్విత శ్రీ లక్ష్మీనరసంహ స్వామిని దర్శించుకోవడంతో పాటు వినాయ చవితి ఉత్సవాలలో పాల్గొడం తమ అదృష్టంగా బావిస్తూన్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను శాంతి యుతంగా, సమైఖ్యంగా నిర్వహించి సమాజాభివృద్దికి సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం లడ్డు, చెరకు గెడల లాంటి తదితర వెలంపాటను నిర్వహించారు,

## భారీ ధర పలికిన గణనాథుని ప్రసాదం

పులివెందుల, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :



పులివెందుల పట్టణంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి వీధిలో గణనాథుని విగ్రహాలు కొలువుదీరాయి. ఐదవరోజైన ఆదివారం గణనాథుని నిమజ్జనం సందర్భంగా పలు విగ్రహాల వద్ద ప్రసాదంగా పెట్టిన లడ్డూను వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో వినాయకుడి ప్రసాదం లడ్డూ కోసం భక్తులు పోటాపోటీగా వేలంపాటలో పాల్గొన్నారు. శ్రీరామహాల్‌రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద బచ్చు వెంకట రమణ అలియాస్ రమణ అనే అరటి వ్యాపారస్థుడు వేలంపాటలో రూ.1.63లక్షలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే మారుతిహాల్‌రోడ్డులో అంబకపల్లె నారాయణస్వామి ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద షేక్ మహబూబ్‌బాషా రూ.40వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఆయా విగ్రహాల వద్ద రూ.50వేల నుండి రూ.లక్ష వరకు భక్తులు పాటపాడి గణనాథుని ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం విగ్రహాల వద్ద మంగళవాయిద్యాలతో, డిజె సౌండ్ బాక్సులు, చెక్కభజనలతో భక్తులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండాడీఎస్పీ శ్రీనివాసులు, అర్బన్ సీఐ రాజు, ఏఎస్సై చంద్రశేఖర్, ట్రాఫిక్ఎస్సై హాజీవల్లి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎక్కడికక్కడ బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా గణనాథ నిమజ్జనం

రామాపురం, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:



మండలంలోని నల్ల గుట్టపల్లి, సరస్వతి పల్లి, చిట్లూరు, బండపల్లి, ఇంకా పలు గ్రామాలలో ఆదివారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదు రోజుల నుంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వినాయక కమిటీ సభ్యులు పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బజా బాజంత్రిల ఊరేగింపుగా పెద్ద ఎత్తున ఆయా గ్రామాల పరిధిలో ఉన్న చెరువులలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## రాజు హైస్కూల్లో ఎన్‌సిసికి విద్యార్థుల ఎంపిక

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త



రాజంపేట రాజు హైస్కూల్లో ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక జరిగింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎన్‌సిసిలోకి ఎంపిక చేసే కార్యక్రమాన్ని కడప ఎన్‌సిసి బెటాలియన్ హవాల్‌దార్‌లు సిహెచ్ రావు, ఎన్‌బి సుభ్‌రామ్‌స్వరూఫ్ బిష్నోయ్‌లు నిర్వహించారు. శారీరక ధృఢత్వం, క్రమశిక్షణ, విద్య, అవయవాలు, పరుగుపందెం, ఇతర పోటీలను నిర్వహించి 25 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. గత యేడాదే జిల్లాలోనే మొదటిసారిగా రాజు హైస్కూల్‌కు ఎన్‌సిసి విద్యార్థుల ఎంపిక మొదటిసారిగా అవకాశం దక్కింది. రెండో యేడాది కూడ ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ జరిగింది.

## గండిక్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116లు విరాళం

చక్రాయపేట, సెప్టెంబర్ 4ప్రభాతవార్త: ఆర్‌సిటి17



చాపాడు మండలం టివో పల్లె వాస్తవ్యులు లింగిరెడ్డి నందిరెడ్డి సతీమణి చంద్ర ఓబులమ్మ కుమారుడు నాగేశ్వరరెడ్డి ధర్మపత్ని హారతి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు స్వామివారి నిత్యాన్నదాన పథకానికి విరాళం సమర్పించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మెన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక పూజలుచేసి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ దాతలు స్పందించి విరాళాలు ఇస్తున్నారని శ్రీమంతులు సహకరిస్తే మరింత త్వరగా ఈ కార్యక్రమం సఫలీకృతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో వీరి బంధువు రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథ నిమజ్జనం

రామాపురం, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:

మండలంలోని నల్లగుట్టపల్లి, సరస్వతి, చిట్లూరు, బండపల్లి ఇంకా పలు గ్రామాలలో ఆదివారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదు రోజుల నుంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వినాయక కమిటీ సభ్యులు పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బజాబా జంత్రిల ఊరేగింపుగా పెద్ద ఎత్తున ఆయా గ్రామాల పరిధిలో ఉన్న చెరువులలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమాని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనం

సుండుపల్లి, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:



సుండుపల్లి మండలం వాయల్పాటి వాండ్లపల్లిలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో చిన్నలు, పెద్దలు మహిళలు నృత్యాలు చేశారు. ట్రాక్టర్‌పై వినాయకుని ఊరేగించి బాణసంచా కాల్చి డప్పు వాయిద్యాలతో పురవీధుల్లో వినాయకుడిని ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన వేషధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి. గ్రామ శివారులోని చెరువులో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తిరుమలరెడ్డి, లియారెడ్డి, చిన్నారెడ్డి, గోపాల్‌రెడ్డి, బసిరెడ్డి, శేషారెడ్డి, చెరసాల వెంకటరమణ, కృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శేషవాహనంపై శ్రీరంగనాథుడి దర్శనం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :



జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో నాలుపూజ ఉత్సవాలు ఈనెల 1వ తేదీ నుండి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామి వారు శేషవాహనంపై కూర్చుని భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఛైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈవో రమణలు చర్యలు తీసుకున్నారు.

## వైభవంగా పూజలు అందుకున్న వినాయకునికి వీడ్కోలు

రాయచోటి, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:



రాయచోటి వ్యాప్తంగా ఐదు రోజులుగా వైబవంగా పూజలు అందుకున్న గణనాధులకు భక్తులు నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు. రాయచోటి పట్టణంలోని వినాయక విగ్రహాలను పురవీధుల్లో డంపు వాయిద్యాలు, చెక్కభజనలో మధ్య ఉత్సవ కమిటీ సభ్యులు పిలలు గణపతి బప్పా మోరియా అంటూ కుంకాలు చల్లుకుంటూ కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్తూ వచ్చిన భక్తులకు దారి పొడవున ప్రసాదాలను అందజేస్తూ గణనాధుల నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన వేడుకలకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులలో నిమజ్జనం చేశారు. నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## సంస్కృతి, సాంప్రదాయం, ఆధ్యాత్మిక శోభలో గణేష్ నిమజ్జనం వేడుకలు

**మేకవారిపల్లెలో వేలం 1.58 లక్షలు పలికిన గణేష్ లడ్డూ**

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త



గణేష్ ఉత్సవాలు సాంస్కృతిక సౌరభాన్ని చాటాయి. సంప్రదాయాన్ని మేళవింపు చేశాయి. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా చేశాయి. గణేష్ నిమజ్జన వేడుకల్లో సంస్కృతి, సాంప్రదాయం, ఆధ్యాత్మికత కలసి కనువిందు చేసింది. కోలాహలంగా ఆదివారం ఐదో రోజు రాజంపేట పరిసరాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు అంబరాన్నంటాయి. దాదాపు మండపాలు ఏర్పాటు చేసిన వినాయక వేడుకల్లో 90 శాతం పైబడి విగ్రహాలు నిమజ్జనానికి మేళతాళాల మధ్య, డప్ వాయిద్యాల మధ్య బాణాసంచ పేలుళ్ల మధ్య చాందిని బండ్లపైన ట్రాక్టర్లలో ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లాయి. గణపతిపప్ప మోరియా అంటూ పలువీధుల్లో గణేష్ నిమజ్జన వేడుకల్లో మహిళలు కూడ ఉత్సాహంగా వసంతోత్సవం ఆడుకొంటూ రంగులు చల్లుకొంటూ కనిపించడం విశేషం. బలిజపల్లె రోడ్డులో చాందిని బండిలో వినాయకుని ఊరేగించారు. భరత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చిట్టి వినాయకున్ని నిమజ్జనంలో చిన్నారులు డప్‌లు వాయిస్తూ అలరించారు.3వ రోజు మండలంలోని శవనవారి పల్లెలో 1.23 లక్షలు పలికిన గణేష్ లడ్డూ పక్క గ్రామమైన మేకవారిపల్లెలో గన్నె బ్రదర్స్ అంజినాయుడు, సుబ్బనరసయ్యలు 1.58 లక్షలకు వేలం పాటలో లడ్డూను దక్కించుకొన్నారు. గ్రామమంతా వినాయ కుని నైవేద్యాన్ని పంచిపెట్టారు. రాజంపేట పట్టణం ఆర్‌డిఒ కార్యాలయం పక్కనే వినాయకనగర్ ఉత్సవ కమిటి వేలం పాటలో 90,116 రూపాయలకు రామచంద్రనాయుడు వినాయకుని లడ్డూ వేలం పాటలో దక్కించుకొన్నారు. మదనగోపాల పురం దిగువపల్లెలో చల్లా పెంచలయ్య 80 వేలకు వేలం పాటలో లంబోధరుడు లడ్డూను కైవసం చేసుకొన్నారు. రాజంపేట పట్టణం బలిజపల్లె రోడ్డులో ఉత్సవ కమిటి నిర్వహించిన లడ్డూ వేలం పాటలో ఆటో డ్రైవర్ పట్టెం శేషాద్రి 41 వేలకు లడ్డూను దక్కించుకొన్నారు. బ్రాహ్మణపల్లెలో కొల్లా రాజేంద్రనాయుడు 26,300 లడ్డూ వేలం పాట పాడారు. ఎంజి పురం ఇసుకపల్లెలో ఉపసర్పంచ్ రుద్రనారాయణరాజు 14 వేలకు లడ్డూను దక్కించుకొన్నారు. చక్రదరకాలనిలో 15 వేలకు చీమకుర్తి శ్రీనివాసులు వేలం పాటలో లడ్డూను దక్కించుకొన్నారు.

## గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారక

రామాపురం, సెప్టెంబర్ 4ప్రభాతవార్త:



మండల కేంద్రంలో సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి కుమారుడు చందు ఆధ్వర్యంలో మొదైలన గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సకల విఘ్నాలను హరించి, విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన దేవదేవున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

**భారీ అన్నదానాలు**

చిట్వేలి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త



చిట్వేలి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీగణనాధుని నిమజ్జనాలను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిట్వేలి గ్రామంలోని గాజులవీధి, సత్యమ్మవీధి, మండల పరిధిలోని పలుచోట్ల వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గాజులవీధిలో దాతలు లక్ష్మీకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా వైసిపి నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సత్యమ్మవీధిలో రంగాచారి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా మాదాసు నరసింహా, ఆనందల సురేష్, ఆనందల రవి, నాయిని సురేంద్రలు కార్యకర్తలుగా వ్యవహరించారు. లడ్డూ వేలంలో 27500 రూపాయలకు పెదమల్లి వెంకట్ సొంతం చేసుకొన్నాడు. అనంతరం భక్తుల నడుమ గణేష్ నిమజ్జనం కొనసాగింది.

## మంజునాథరెడ్డికి ప్రముఖుల నివాళి

(మొదటి పేజీ తరువాయి)





లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఆవుల సునీతమ్మ, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ ఆవుల నాగబూషణ్‌రెడ్డి, రాయదుర్గం మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఉపేందర్‌రెడ్డి, ఇండియన్ గ్యాస్ సుబ్బారెడ్డి, రెండు జిల్లాల వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపిటిసిలు, జడ్పీటిసిలు, సర్పంచ్‌లు, బంధువులు, మీడియా మిత్రులు, రామాపురం జడ్పీటిసి వెంకటరమణలు పప్పిరెడ్డి మంజునాథరెడ్డి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం, వైజాగ్, చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రముఖులు, పలు మండలాల ఎంపిపిలు, జడ్పీటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మాజీలు, ప్రజలు, పెద్ద ఎత్తున హాజరయ్యారు.